క్లుప్తంగా

నేటి నుంచి జగనన్న కాలనీ ఇళ్ల రిజిస్ట్రేషన్లు



రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సిద్ధం చేస్తున్న తహసీల్దార్ ధనుంజయులు

పీలేరు : జగనన్న కాలనీల్లో హౌసింగ్ లబ్ధిదారులకు మంగళవారం నుంచి ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడుతున్నట్లు తహసీల్దార్ ధనుంజయులు తెలిపారు. సోమవారం బోడుమల్లువారిపల్లె గ్రామ సచివాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో మొత్తం 6866 మంది లబ్ధిదారుల ఇళ్ల రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్లకు అన్ని గ్రామసచివాలయ సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ చాణక్య, పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి1న బసినికొండ దర్గా ఉరుసు

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం బసికొండలో వెలసిన శ్రీ బాబా అబ్దుల్‌దహుస్సేని దర్గా ఉరుసు ఉత్సవాలు ఫిబ్రవరి 1న నిర్వహిస్తున్నట్లు దర్గా మతవల్లి కెఎస్ఎస్‌బి నూర్ బాబాసదర్ సజ్జాదానసీన్ తెలిపారు. సోమవారం దర్గాలో ఉరుసు ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జనవరి 30న నషాన్, 31న గంధం జరుగుతుందన్నారు. ఉరుసు ఉత్సవాలకు హిందూ,ముస్లిం సోదరులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు జాకీర్, షేక్ రియాజ్, జాఫర్ హుస్సేని,ఖాదర్‌వల్లి, షామీర్‌బాషా,ఎడి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న ఫరీద్

కురబలకోట: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి అత్యవసర పరిస్థితిలో రక్తమిచ్చి ఓ యువకుడు ప్రాణం కాపాడాడు. వివరాలలోకి వెళితే..వేంపల్లెకు చెందిన కృష్ణారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కడప హిమాలయ హాస్పిటల్‌లో చేర్చారు. ప్రమాద సమయంలో అధిక రక్తం పోవడంతో ప్రాణాపాయస్థితి ఎదురైంది. ఏబీ నెగిటివ్ రక్తం కోసం దాతల సాయం కోరారు. చాలా ప్రయత్నాలు చేసినా అప్పటికీ దొరకలేదు. చివరకు కురబలకోట మండలం అంగళ్లకు చెందిన ఫరీద్ అనే యువకుడు కడపకు వెళ్లి స్వచ్ఛందంగా రక్తమిచ్చి మానవత్వం చాటుకున్నాడు.

హెచ్‌ఎం మృతికి నివాళి

తంబళ్లపల్లె: స్థానిక ఎంపీపీ మెయిన్ స్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేసే పురుషోత్తం ఆచారి(59) గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబీకుల కథనం మేరకు.. మదనపల్లెలో కాపురం ఉన్న అతను సోమవారం పాఠశాలకు వెళ్లే సమయంలో స్వగృహంలోనే కుప్పకూలి మృతి చెందాడు. ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, టీచర్లు ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబీకులను ఓదార్చారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

బి.కొత్తకోట: సరిహద్దు కర్ణాటక నుంచి మండలంలోని అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్‌చేసి కోర్టుకు తరలించామని హెడ్‌కానిస్టేబుల్ మారుతిరెడ్డి సోమవారం తెలిపారు. మండలంలోని బడికాయలపల్లె గ్రామానికి చెందిన వెంకటరమణ (62), నారప్ప (55)లు కర్ణాటకలో రెండు మద్యం బాక్సులు కొనుగోలు చేసి మండలంలోని తరలించేందుకు బడికాయలపల్లె చెక్‌పోస్టుకు దూరంగా గుట్టల్లోంచి నడుచుకొంటూ తీసుకువస్తుండగా దాడులు నిర్వహించినట్టు తెలిపారు. వీరి నుంచి మద్యం స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు.

ఆలయ భూమికి హద్దులు చూపించండి

కలకడ : మండలంలోని కలకడ చౌడేశ్వరిదేవి ఆలయం నిర్మాణం కోసం అమ్మ వారికి పూర్వీకులు కేటాయించిన స్థలానికి హద్దులు చూపాలని ఆలయ కమిటీ సభ్యులు, తొగటవీర క్షత్రియకులస్తులు జిల్లా జాయింట్ కలెక్టర్ ఇన్నాన్ అహమ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా రాయచోటికి వెళ్లి ఈమేరకు వినపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చేనేత సంక్షేమ సంస్థ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేంద్ర, నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు జయరాం, చిన్నరెడ్డెప్ప, రామక్రిష్ణ, ఆంజినేయులు, ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగు పంచాయతీ అన్ని విధాలా అభివృద్ధి చెంది మండలంలోనే ప్రథమ స్థానంలో ఉంది. పంచాయతీలో పూర్తిగా తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాల మేరకు జలజీవన్ మిషన్ పథకం నిధులు సుమారు రూ.26 లక్షలు ఖర్చుతో 6 నూతన బోర్లు వేసి కొత్త మోటార్లు, పైపులు వేశారు. పుష్కలంగా నీరు వస్తోంది. నీటి సమస్య తీరడంతో ఎమ్మెల్యేకు సర్పంచ్ శ్యామలమ్మ, ఎంపీటీసీ సభ్యులు మహేష్ కృతజ్ఞతలు తెలిపారు.

నిరాదరణ పిల్లలకు న్యాయం చేస్తాం

- నిరసన దీక్ష విరమింపజేసిన నిసార్‌అహ్మద్
- జర్నలిస్టులకు ఇంటిస్థలాల విషయమై ఆర్డీఓతో చర్చలు



బహుజనసేన శ్రీచందుకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె : నిరాదరణకు గురైన పిల్లల నివాసం కోసం సబ్ కలెక్టరేట్ ఎదుట మూడురోజులుగా నిరసనదీక్ష చేస్తున్న బహుజనసేన సభ్యులు, పిల్లలను సోమవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పరామర్శించారు. మూడురోజులుగా దీక్ష చేస్తున్న విషయమై బహుజనసేన వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీచందును వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ మహబూబ్‌చాంద్‌తో మాట్లాడి పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్నారు. శ్రీచందుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. నిరాదరణకు గురైన పిల్లలకు ప్రభుత్వ స్థలంతో పాటుగా, భవన నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కేటాయింపునకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం జీవో వెలువరించిన నేపథ్యంలో, మదనపల్లె జర్నలిస్టులకు సంబంధించి స్థల సేకరణపై రెవెన్యూ అధికారులతో చర్చించారు. జర్నలిస్టులకు సౌకర్యంగా ఉండేలా, అన్ని వసతులతో కూడిన స్థలాన్ని ఎంపికచేయాలని సూచించారు. రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి పలుమార్లు ఈ విషయమై తనకు సూచించారని, త్వరితగతిన స్థల సేకరణ పూర్తిచేసి, జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, కౌన్సిలర్ పాల్‌చంద్రశేఖర్, నాయకులు బండపల్లి అక్కులప్ప, ఎస్.మస్తాన్‌ఖాన్, బహుజనసేన కొండుపల్లి ఆనంద్, రాఘవేంద్రయాదవ్, రూపక్‌నాయక్, నవీన్‌నాయక్, చంద్రశేఖర్, వెంకీ, గంగాధర్, వంశీ, శ్రీకాంత్, లవ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ తాత్కాలిక భవనాలు పూర్తిచేయాలి

– ఏపీఎంఎస్ఐడీసీ సీఈ సుధాకరరెడ్డి



జిల్లా ఆస్పత్రిలో పర్యటిస్తున్న ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్ల బృందం

మదనపల్లె : మదనపల్లె మెడికల్ కళాశాలకు అనుబంధంగా స్థానిక ప్రభుత్వాసుపత్రి మొదటి అంతస్తులో నిర్మిస్తున్న తాత్కాలిక అదనపు తరగతి గదుల నిర్మాణం నెలరోజుల్లో పూర్తిచేయాలని ఏపీఎంఎస్ఐడీసీ సీఈ సుధాకరరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో జరుగుతున్న నిర్మాణాలను ఎస్ఈ కృష్ణారెడ్డితో కలిసి సీఈ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇప్పటికే అంతర్గత నిర్మాణాలు పూర్తికావచ్చాయని, మిగిలిన పనులు నెలరోజుల్లో పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామన్నారు. కాగా మెడికల్ కాలేజీ నిర్వహణకు కంప్యూటర్లు, ఇతర సామగ్రి వచ్చిందని, వీటిని నిర్వహించేందుకు భవనాలు లేక ఇబ్బంది పడుతున్నామని మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ జమున, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.రాజు ఇంజనీర్ల దృష్టికి తెచ్చారు. దీంతో సీఈ మాట్లాడుతూ..ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న డీఈఐసీ భవనం ఖాళీగా ఉందని, అందులో తాత్కాలిక కార్యాలయం ఏర్పాటుచేసుకోవాలని ప్రిన్సిపాల్‌కు తెలిపారు. బ్లడ్‌బ్యాంక్, ప్లాస్మాపరీక్ష చేసే యంత్రం అందుబాటులోకి తేవాలని వైద్యులు సీఈని కోరారు. అనంతరం ఆరోగ్యవరం వద్ద నిర్మిస్తున్న మెడికల్ కాలేజి భవనాలను ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి, అక్కడి కాంట్రాక్టర్లకు తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ డీఈ కరీముల్లాఖాన్, ఏఈ విష్ణువర్ధన్, కాంట్రాక్టర్ రాజేంద్రరెడ్డి, ఎలక్ట్రికల్ డీఈ హరిప్రసాద్, టీసీఈ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీలో రెండు వేలిముద్రలు తొలగించండి

కలకడ : ఎండీయూ ఆపరేటర్లు ఇంటింటికీ బియ్యం అందించడంలో రెండు మార్లు కార్డు దారుల వద్ద వేలిముద్రలు తీసుకోవడం అదనపు బాధ్యత అవుతోంది. తద్వారా పంపిణీ ఆలస్యమవుతోంది. ఒక్కమారు వేలిముద్ర తీసుకునే విధంగా ఏర్పాటు చేయాలని ఎండీయూ ఆపరేటర్లు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్‌కు ఈమేరకు వినతి పత్రం అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి వికలాంగులు, వృద్ధులు, దూరప్రాంత కార్డు దారులు వేచిచూడకుండా ఇంటివద్దకే నిత్యవసర వస్తువులు అందించేలా చేశారన్నారు. అయితే ప్రభుత్వం నిర్ణయించిన మేరకు కూలీలు పెంచి, ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన కూలి మొత్తాన్ని వెంటనే అందజేయాలని కోరారు. రాష్ట్ర ఎండీయూ ఆపరేటర్ల సంఘం పిలుపు మేరకు వినతి పత్రం అందిచేసినట్లు ఆ సంఘం మండలశాఖ అధ్యక్షులు బాబ్‌జాన్ తెలిపారు.

ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆధ్వర్యంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదిత చార్జీల పెంపు, విద్యుత్ కొనుగోళ్లపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఈఈ యుగంధర్ తెలిపారు. మదనపల్లె డివిజనల్ కార్యాలయం నుంచి పుంగనూరు, మదనపల్లె డివిజన్‌కు సంబంధించి, విశాఖపట్నంలోని ఏపీ ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో వర్చువల్ విధానంలో జరుగుతున్న ప్రజాభిప్రాయసేకరణలో పాల్గొన్నట్లు చెప్పారు. మదనపల్లె, పుంగనూరు డివిజన్ల నుంచి మొదటిరోజు తమ అభిప్రాయాలను తెలిపేందుకు ఎవరూ పేర్లు నమోదుచేసుకోలేదన్నారు. ఏపీ ఈఆర్‌సీ అనుమతితో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, తిరిగి రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

వాల్మీకిపురం: మండలంలోని జర్రావారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు విశ్వనాథ్‌ను సోమవారం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పరామర్శించారు. ఇటీవల విశ్వనాథ్ తల్లి మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి జర్రావారిపల్లిలోని విశ్వనాథ్ ఇంటికి చేరుకొని ఆయనను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం స్థానిక సాయినారాయణ సేవా నిత్య అన్నదాన కార్యక్రమం ద్వారా 300 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

పెద్దమండ్యం: ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి అధికారులతో ఆమె సమీక్షించారు. పల్లెల్లో విద్యుత్ దీపాల ఏర్పాటు, తాగునీటి సమస్యపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. గ్రామ సర్పంచ్‌ల సహకారంతో ఎనర్జీ అసిస్టెంట్‌లు విద్యుత్ దీపాల ఏర్పాటు పనులు చూడాలన్నారు. అలాగే తాగునీటి సమస్య ఎక్కడైనా ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్‌వోపల్లె పంచాయతీలోని మిట్టావాండ్లపల్లె, గుర్రంవాండ్లపల్లె పంచాయతీలోని గుట్టకిందపల్లెల్లో తాగునీటి సమస్య ఉన్నట్లు సర్పంచ్‌లు తెలిపారు. మిట్టావాండ్లపల్లెలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ తెలిపారు. అలాగే గుట్టకిందపల్లెలో కొత్తగా తాగునీటి బోరు వేసినట్లు చెప్పారు. త్వరలో మోటారును అమర్చి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరిప్రసాద్, వైస్ ఎంపీపీ జయచంద్రారెడ్డి, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, సర్పంచ్‌లు సోదనపల్లె బాషా, పద్మావతమ్మ, విశ్వనాథ, ఎంపీటీసీ సభ్యులు మంచూరి జయరాం, గీత, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

కలకడ : మండలంలోని ప్రతి బూత్‌లెవల్‌లో తప్పులులేని ఓటర్ల తుదిజాబితా సిద్ధం చేయాలని తహసీల్దార్ ప్రదీప్ ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించి నూతన జాబితాను పరిశీలించారు. కేసులు, ఆరోపణలు రాకుండా నిజాయితీగా ఓటర్లు నమోదు, తొలగింపు కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. బీఎల్‌ఓలు ఇచ్చిన జాబితా, నూతన ఓటర్ల నమోదు, ఆన్‌లైన్‌లో నమోదు క్షుణ్ణంగాగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో ప్రతిభ

నిమ్మనపల్లె : ఇటీవల మదనపల్లె జెడ్పీహైస్కూల్ మైదానంలో జరిగిన నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో ప్రతిభచూపిన నిమ్మనపల్లె క్రీడాకారులు సోమవారం మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో మెడల్స్, ప్రశంసాపత్రాలు, బహుమతులు అందుకున్నారు. ఆర్డీఓ మురళి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో భాగంగా జరిగిన ఖోఖో పోటీల్లో ముష్టూరు బాలికల జట్టు విజేతగా నిలిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైంది. కొండయ్యగారిపల్లె జట్టు రన్నర్స్‌గా నిలిచింది. కబడ్డీ పోటీల్లో నిమ్మనపల్లె సచివాలయ జట్టు రన్నర్స్‌గా నిలువగా, బాడ్మింటన్ పోటీల్లో నిమ్మనపల్లె అగ్రహారం సచివాలయ జట్టు తృతీయస్థానం దక్కించుకున్నాయి. ప్రతిభ చూపిన క్రీడాకారులకు అధికార బృందం ప్రశంసాపత్రాలు, మెడల్స్, ట్రోఫీ అందజేశారు.

ఎమ్మెల్యే చొరవతో మురుగు కాలువల ఏర్పాటు

పెద్దతిప్పసముద్రం: తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇటీవల కమ్మచెరువులో పర్యటించారు. మురుగు నీటి కాలువలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. తక్షణం ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన కాలువలు నిర్మించాలని ఆదేశించారు. కాలువ నిర్మాణ పనులను చేపట్టారు. సోమవారం కాలువ పనులను ఎంపీపీ మహమూద్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గణపతిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ డ్రిప్ రమణ పరిశీలించారు.

గర్భిణుల సంరక్షణ కుటుంబ సభ్యుల బాధ్యత

పీలేరు : గర్భిణుల సంరక్షణ కుటుంబ సభ్యుల బాధ్యత అని డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. సోమవారం పీలేరు మోడల్ కాలనీలో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. మానసికంగా ప్రశాంతత అలవర్చుకోవాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఎనిమిది గంటల నిద్ర, పగటిపూట రెండు గంటల విశ్రాంతి, ఉదయం పూట తేలికపాటి నడక, సమయానికి డాక్టర్‌తో ఆరోగ్య పరీక్షలు చేపించుకోవాలన్నారు. హెచ్‌ఈ కొండయ్య, ఏఎన్‌ఎం లక్ష్మీ, సీహెచ్‌వో సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి

మదనపల్లె సిటీ: ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. సోమవారం కాలేజీలో మైక్రోసాఫ్ట్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు టెక్నాక్షం ఫౌండేషన్ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటర్ రంగాల్లో రాణించాలన్నారు. కంప్యూటర్ సైన్స్‌లో అభివృద్ధి చెందుతున్న రంగాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎడ్యునెట్ ఫౌండేషన్ వివేక్, అశ్వినికుమార్, వరప్రసాద్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసులు

మదనపల్లె సిటీ: బెంగళూరులో జరిగిన 6వ నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక మయాబజార్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 6వ తరగతి చదువుతున్న సి.మాన్యప్రియ అండర్–28 కేజీల విభాగంలో ఫైటింగ్ గోల్డ్‌మెడల్, కటా విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. సీ.లాస్యప్రియ అండర్–40 కేజీల విభాగంలో ఫైటింగ్ నందు గోల్డ్‌మెడల్, కటా విభాగంలో బ్రాంజ్‌మెడల్‌ను సాధించారు. వీరికి కోచ్‌గా సెన్సాయి విఘ్నేష్ వ్యవహరించారు. సోమవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు మాన్యప్రియ, లాస్యప్రియలను అభినందించారు.

రెండు ద్విచక్రవాహనాల ఢీ

మదనపల్లె : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం జరిగింది. విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న విద్యార్థులు శివ, ముజిందర్‌లు మదనపల్లె మండలం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష రాసేందుకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెకు చెందిన మంజుల(25) ద్విచక్రవాహనంలో మరో మహిళను ఎక్కించుకుని మదనపల్లెకు బయలుదేరింది. మార్గమధ్యంలో వలసపల్లె నవోదయ స్కూల్ సమీపంలో లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థుల ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలు దెబ్బతిని, ప్రమాదంలో మంజుల తీవ్రంగా గాయపడింది. విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి.

యూనియన్ బలోపేతానికి కృషి చేయాలి



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

పీలేరు : ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని పీలేరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రటరీ కుసుమకుమారి, శ్యామల, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్‌లకు కంటిచూపు ముఖ్యం

– ఎంవీఐ శివలింగయ్య



ఎంవీఐ కార్యాలయంలో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మదనపల్లె : వాహన డ్రైవర్లకు మంచి కంటిచూపుతో పాటు సరైన మానసిక స్థితిని కలిగి ఉండటం చాలా ముఖ్యమని ఎంవీఐ శివలింగయ్య అన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఆర్టీఓ కార్యాలయంలో డ్రైవర్లకు కంటిపరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంవీఐ శివలింగయ్య మాట్లాడుతూ.... ఈ ఏడాది యువశక్తి ద్వారా సామాజిక మార్పు అనే పేరుతో 35వ జాతీయరహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్న చిన్న తప్పిదాలే పెద్ద ప్రమాదాలకు కారణమవుతాయన్నారు. వాహనాలు నడిపేవారు రహదారి భద్రతా నియమాలను పాటించకపోవడం, అజాగ్రత్త, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం వంటి ప్రధాన కారణాల వల్ల రోడ్డుప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో యువతీ, యువకులకు రోడ్డుభద్రతా చర్యలు, ట్రాఫిక్ నియమనిబంధనలపై అవగాహన కల్పించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో డ్రైవర్ ప్రాముఖ్యతను వివరించి, రహదారి ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ భద్రతానియమాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీఓ కార్యాలయ సిబ్బంది, లారీ, ఆటో, క్యాబ్ డ్రైవర్లకు దాదాపు 50మందికి పైగా ఎల్‌వీ.ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు కంటిపరీక్షలు నిర్వహించారు.

రెడ్డెమ్మకొండ ఆలయ నిర్మాణానికి విరాళం



దాతలను సన్మానిస్తున్న ఆలయ అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రెడ్డెమ్మకొండ ఆలయ పునర్నిర్మాణానికి కర్ణాటకా రాష్ట్రం బెంగళూరుకు చెందిన దాతలు గోపాల్‌రెడ్డి రూ.50 వేలు, రెడ్డెమ్మ, రెడ్డిశంకర్ దంపతులు రూ, 50 వేలు విరాళంగా అందజేశారు. సోమవారం ఆలయానికి విచ్చేసిన దాతలకు ఆలయ అధికారులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం దాతలు ఇచ్చిన మొత్తాన్ని ఆలయ ఇన్స్‌పెక్టర్ బాలకృష్ణకు అందజేశారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలకు చైర్మన్ నరసింహారెడ్డి, ఈవో మంజుల కృతజ్ఞతలు తెలియజేశారు

రేపు తలనీలాల సేకరణకు వేలం

రెడ్డెమ్మతల్లి ఆలయంలో తలనీలాల సేకరణ కు సంబంధించి ఈనెల 31న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఈవో మంజుల తెలిపారు. సోమవారం స్థానిక ఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2024 మార్చి 31 నుంచి 2025 మార్చి 31 వరకు ఆలయంలో భక్తులు అమ్మవారికి సమర్పించే తలాలనీ సేకరణ హక్కు కోసం వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొన దలచిన వారు రూ. 5 లక్షల ధరావత్తు చెల్లించి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దేవదాయశాఖ నిబంధనల మేరకు వేలం నిర్వహిస్తారన్నారు.

టీడీపీ నాయకుల ఆరోపణలు అవాస్తవం



మాట్లాడుతున్న పెన్షన్‌దారుడు రామయ్య

పెద్దతిప్పసముద్రం: టీడీపీ నాయకుల ఆరోపణలన్నీ అవాస్తవాలేనని మండలంలోని కమ్మచెరువు పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఇదే పంచాయతీలోని మొరుసుపల్లిలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని పెద్దపాళ్యం రామయ్య అనే వృద్ధుడు ఎమ్మెల్యేను ప్రశ్నించడంతోనే తన పెన్షన్‌ను తొలగించారని టీడీపీ నాయకులు ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. అర్హతే ప్రామాణికంగా, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీదేనని టీడీపీ నాయకులందరూ గుర్తించుకోవాలన్నారు. సదరు రామయ్య పేరిట వైఎస్సార్ పెన్షన్ కానుక ఐడీ నంబర్ 110557304 మంజూరులోనే ఉందన్నారు. టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలన్నారు. పెన్షన్‌దారుడు రామయ్య మాట్లాడుతూ గత నెలలో కూడా తాను పెన్షన్ సొమ్ము తీసుకున్నానని, కేవలం స్థానికంగా ఉన్న వలంటీర్‌కు తమ మధ్య ఉన్న మనస్పర్థల కారణంగానే ఈ నెల తీసుకోలేదన్నాడు.

టూరిజం ప్రైవేటీకరణ ప్రక్రియ రద్దు


– టూరిజం బోర్డు డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి

బి.కొత్తకోట: మండలంలోని హార్సిలీహిల్స్ సహా ఉమ్మడి కడప జిల్లాలోని యూనిట్లను కలిసి ఒక క్లస్టర్‌గా ప్రైవేటుకు అప్పగించే టెండర్ల ప్రక్రియ రద్దు చేయించామని టూరిజం బోర్డు డైరెక్టర్ మిట్టపల్లె భాస్కర్‌రెడ్డి చెప్పారు. పర్యాటకశాఖ పాలకమండలి పర్యాటకశాఖ పాలకమండలి అనుమతి లేకుండా రాష్ట్రంలోని టూరిజం యూనిట్లను క్లస్టర్లుగా చేసి ఆపరేషన్స్ అండ్ మెయింటే నెన్స్ పద్ధతిలో అనుభజ్ఞులకు అప్పగించేందుకు టెండర్ల ప్రక్రియ జరిగిందని తెలిపారు. దీనిపై సోమవారం విజయవాడ పర్యాటకశాఖ కార్యాలయంలో చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన పాలకమండలి సమావేశంలో టెండర్ల ప్రక్రియను రద్దు చేస్తూ యథావిధిగా కార్యకలాపాలు సాగేలా బోర్డు సమావేశం తీర్మానం చేసిందని తెలిపారు. దీనిపై ఉద్యోగులు, సిబ్బంది ఆందోళన చెందవద్దని కోరారు. సమావేశంలో ఉద్యోగులు, సిబ్బంది ప్రమోషన్లు, వేతనాల పెంపుపై చర్చించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తం టూరిజం యూనిట్ల అభివృద్ధి, ఆధునీకరణకు నిధులు కేటాయించాలని కోరినట్లు చెప్పారు.

ఏపీ శాక్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్నిక

మదనపల్లె సిటీ: ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీ శాక్స్) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీని తిరుపతిలో ఎన్నుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ వివరాలకు ఆ యూనియన్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.జయకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులుగా సుదర్శివేణు, ప్రధాన కార్యదర్శిగా పి.వెంకటసుబ్బయ్య, వర్కింగ్ సెక్రటరీగా జె.వీరాస్వామి, కోశాధికారిగా నల్లా హరిబాబు, రాష్ట్ర సమన్వయకర్త కె.కోటిరత్నం, అధికార ప్రతినిధిగా ఎస్ఎండి షహీద్, ఉపాధ్యక్షులుగా కె.అపర్ణ, ఎస్.శివశ్రీ, వి.బద్రి, ఎస్.రామకృష్ణారెడ్డి, రామకృష్ణారావు, టి.గోపాల్, సి.పుల్లయ్యానాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా శ్రీరామశర్మ ఎన్నికైనట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీలో మదనపల్లెకు చెందిన పుల్లయ్యానాయుడుకు స్థానం లభించిందన్నారు. నూతన అధ్యక్షులు వేణు మాట్లాడుతూ ఇతర కాంట్రాక్టు ఉద్యోగుల మాదిరిగా ఏపీ శాక్స్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో మరమ్మతు పనులు



దెబ్బతిన్న బస్టాండ్ పిల్లర్‌ను పరిశీలిస్తున్న డీఎం కుమార్

పీలేరు రూరల్ : పీలేరు ఆర్టీసీ బస్టాండ్ మరమ్మతు పనులను రూ. 8 లక్షల నిధులతో చేపడుతున్నట్లు డీఎం బి. కుమార్ తెలిపారు. సోమవారం నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్ సీలింగ్ మరమ్మతు పనులు, ఒక పిల్లర్ మరమ్మతు పనులు చేస్తున్నట్లు తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో వుంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులకు శుద్ధ జలం అందిస్తున్నట్లు తెలిపారు. బస్టేషన్ మేనేజర్ రెడ్డెప్ప, ఎస్టీఐ బాబునాయక్, ఏడీసీ హనీఫ్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



దోస పంటను పరిశీలిస్తున్న అధికారులు

పీలేరు రూరల్ : పుచ్చ, దోస సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ముడుపులవేములలో పుచ్చ, దోస పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరులో 10, కలకడలో 40, కేవీపల్లె 5 ఎకరాలు పంట సాగు చేసినట్లు తెలిపారు. మల్చింగ్ పద్ధతిలో సాగు చేసిన రైతులకు ప్రభుత్వం ఒక హెక్టారుకు రూ. 16 వేలు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. పుచ్చలో రసం పీల్చే పురుగు నివారణకు ఎకరాకు 30 జిగుర పట్టించి పసుపురంగు అట్టలను ఏరాటు చేసుకోవాలన్నారు. అలాగే రేజెంట్ అనే మందును 2 ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో దరహాస్‌రెడ్డి, ఆర్‌బీకే ఇన్‌చార్జి సుమతి తదితరులు పాల్గొన్నారు.